www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 సెప్టెంబర్ 2024

5

వైఎస్ఆర్

'ఉక్కు' రక్షణ రాస్తారోకోను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్‌లో తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోక పోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయివేటీకరణను నిరసిస్తూ ఈనెల 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ఆందోళన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మీ దేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్‌కీరణ చేయడంలో అంతర్యం ఏమిటని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని తెలిపారు. కేంద్రమంత్రి వచ్చి ప్రయివేటీకరణ చేయబోం వాటి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి ఇపటికీ మూడు నెలలు కావస్తున్నా వాటి స్థితిగతులు గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు వేల మంది రైతులు భూములు ఇచ్చారని పేర్కొన్నారు. 32 మంది ప్రాణాలు బలిదానం, త్యాగమని తెలిపారు.

పరి హారం.. హాసం!

గండికోట నిర్వాసితులతో పాలకులు పరిహాసమాడుతున్నారు. దశాబ్దాల తరబడి నిర్వాసితుల జీవితాలతో చదరంగం ఆడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఆసరా చేసుకుని టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి ఏకంగా పాదయాత్ర చేశారు. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు సార్లు పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంది. ప్రభుత్వం కర్నూలు జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్న నేపథ్యంలో గండికోట నిర్వాసిత కాలనీల్లోకి వెనుకజలాలు చేరుతుండడం ఆందోళన నెలకొంది. గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయంలో ఆసక్తి నెలకొంది.

- **రూ.454 కోట్ల చెల్లింపులకు నిరీక్షణ**
- **నిర్వాసిత గ్రామాల్లోకి వెనుకజలాలు**
- **వెంటాడుతున్న ముంపు భయం**
- **త్వరలో గండికోటలో పూర్తి స్థాయి నిల్వ**

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గండికోట నిర్వాసితుల గోడు ఎవరికీ పట్టడం లేదు. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టిఎంసిల నిల్వ సామర్థ్యం గండికోట సొంతం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన త్యాగధనులు నిర్వాసితులు. వారిని నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు దఫాలుగా నిండడం, మరోసారి శ్రీశైలానికి పెద్దఎత్తున వరద కొనసాగుతున్న నేపథ్యంలో గండికోటకు 10 వేల క్యూసెక్కుల నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికి 19.9 టిఎం సిల నిల్వతో జలకళను సంతరించుకుంది. ఐదు రోజుల వ్యవధిలో 26.85 టిఎంసిలతో పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకోనుంది. ఇప్పటికే నిర్వాసిత గ్రామాలైన పి.అనంతపురం, చామలూరు, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లోకి వెనుకజలాలు చేరుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

2018 ఆగస్టులో టిడిపి సర్కారు రూ.6.75 లక్షల చొప్పున పరిహారం చెల్లింపులు చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే గండికోట నిర్వాసితులకు అదనంగా రూ.3.25 లక్షలను కలిపి రూ.10 లక్షల వరకు చెల్లింపులు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆయన ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లుగా సుమారు 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్లు చెల్లింపులు ఆచరణ దిశగా అడుగులు పడక పోవడం ఆందోళన కలిగిస్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల పరిధిలోని 22 గ్రామాలు ముంపు గ్రామాల పరిధిలో 17,809 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.1800 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. 16,800 పిడి ఎఫ్‌లకు రూ.10 లక్షల చొప్పున రూ.1346 కోట్లు పరిహారం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన 999 పిడిఎఫ్‌లకు రూ.454 కోట్ల చెల్లింపులకు దశాబ్దాల తరబడి నిర్వాసితులు ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది. ఫేజ్-1 కింద అప్పటి సిఎం హామీ కింద రూ.295 కోట్లు, మిస్సింగ్ పిడిఎఫ్‌లకు రూ.46 కోట్లు, ఫేజ్-2 కింద కొండాపురం గ్రామానికి రూ.53 కోట్లు, ఫేజ్-3 కింద రూ.999 పిడిఎఫ్‌లకు రూ.56 కోట్లు చొప్పున రూ.454 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా జగన్ గండికోట నిర్వాసితులకు రూ.6.75 లక్షలకు అదనంగా 3.25 లక్షల చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఇచ్చిన హామీని అరకొర చెల్లింపులు చేసి మిగిలిన నిర్వాసితులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. గండికోట నిర్వాసితులకు రూ.110 కోట్లతో 18 కాలనీలకు రూపకల్పన చేశారు. రూ.100 కోట్లతో 11 నిర్వాసిత కాలనీలను పూర్తి చేశారు. రూ.35 కోట్లు బిల్లుల్ని అప్‌లోడ్ చేశారు. మరో రూ.25 కోట్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది.18 నిర్వాసిత కాలనీల్లో ఎనిమిది కాలనీలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందిన కూటమి ఎమ్మెల్యేలపై గండికోట నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనల సందర్భంగా, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా పాదయాత్ర సాగించిన సి.భూపేష్‌రెడ్డిపై గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపులపై ఇచ్చిన హామీలను అమలు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

ఇకెవైసి లక్ష్యం పూర్తయ్యేనా?

- జిల్లాలో ఇప్పటి వరకు 58.26 శాతమే పూర్తి

- మందకొడిగా సాగుతున్న నమోదు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు నుంచి ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది ఇకెవైసి చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాలకు సంబంధించి సెప్టెంబర్ 8 నాటికి 74793 మంది రైతులు 2.03 లక్షల ఎకరాలలో వరి పంటలు సాగు చేసి నమోదు చేశారు. ఆదివారం నాటికి 41324 మంది రైతులు, 1.18 లక్షల ఎకరాలకు సంబంధించి ఇకెవైసి పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో 58.26 శాతం లక్ష్యం పూర్తయింది. ఈనెల 15లోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 42 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కేవలం 6 రోజుల సమయం మాత్రమే ఉంది. జిల్లాలో అట్లూరు, కోడూరు, ఒంటిమిట్ట, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, రాజుపాలెం, పులివెందుల, పెద్దముడియం, కడప, చక్రాయపేట, వేంపల్లి, సింహాద్రిపురం మండలంలో 60 శాతం లక్ష్యం పూర్తయింది. మిగిలిన మండలాల్లో 50శాతం లోపు మాత్రమే రైతులు ఇకెవైసి పూర్తి చేశారు. లక్ష్యాన్ని పరిశీలిస్తే వేంపల్లి మండలం అత్యధికంగా 96 శాతం పూర్తయింది. ఖాజీపేట మండలం అత్యల్పంగా 32 శాతం మాత్రమే ఇకెవైసి లక్ష్యం పూర్తయింది జిల్లాలో పంట సాగు కూడా ప్రస్తుతం మందకొడిగా కొనసాగుతుంది. 1.40 లక్షల మంది రైతులు 3.20 లక్షల ఎకరాలలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఇకెవైసి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు వ్యవసాయ అధికారులు, వివిఎలు కృషి చేస్తున్నారు. ఇకెవైసి చేయకపోతే ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ సహాయం అందని అధికారులు సూచిస్తున్నారు. పూర్తయిన తరువాత పంట నమోదు కార్యక్రమంపై సామాజిక తనిఖీ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇకెవైసి నమోదు చేసుంటున్న రైతు

పేదలకు భూములు ఇవ్వాలి : వ్య.కా.స

సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బద్వేలు

జిల్లాలో ప్రభుత్వ భూములను స్థానికేతరులు, రాజకీయ పలుకుబడి కల్గిన వారు అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి పొందారని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జి .శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా కడప జిల్లాలో అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయకుండా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వహించాయని చెప్పారు. కాశినాయన, కలసపాడు, బ్రహ్మంగారిమఠం, ఒంటిమిట్ట, అట్లూరు, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాలలో పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ 9/77 చట్టం అమలు చేయడంలో జిల్లా రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. కోనేరు రంగారావు సిఫారసులు అమలు చేయాలన్నారు. జెడ్‌హెచ్‌డి భూముల లబ్ధిదారులకు పట్టాలు రైతు భరోసా ఇన్సూరెన్స్ పంట నష్టపరిహారం తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గోపవరం, బద్వేల్ మండలాలలో పేదలు నెలల తరబడి గుడిసెవాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇవ్వని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్, కోనేటి నరసయ్య, జిల్లా కమిటీ సభ్యులు వెంబడి పోలయ్య, రాయప్ప, వెంకటసుబ్బమ్మ, ఎ.రమణయ్య, నరసింహులు, రామ్మోహన్, దుర్గమ్మ, సుభద్రమ్మ, మాధవి, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు

డిసిసి అధ్యక్షులుగా విజయజ్యోతి

నగర అధ్యక్షులుగా అఫ్జల్‌ఖాన్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పఠాన్ మహమ్మద్ అలీఖాన్

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ జిల్లానూ తన కార్యవర్గాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. షర్మిల ప్రకటి ంచారు. పార్టీ జిల్లా అధ్యక్ష లుగా విజయ జ్యోతిని, కడప నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్‌ను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పఠాన్ మహమ్మద్ అలీఖాన్‌ను నియమిస్తూ ఆమె శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికైన వారు మాట్లాడుతూ తమ నియామకానికి కారకులైన పిసిసి అధ్యక్షులు షర్మిలకు, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పాన్ ఇండియా అవార్డుకు ఉపాధ్యాయులు ఎంపిక

ప్రజాశక్తి -ఖాజీపేట భారత దేశ స్థాయిలో ఎంపిక చేసే పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు - 2024కు ఖాజీపేట చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. ఆదివారం గుంటూరులో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజీపేటకు చెందిన ఉపాధ్యాయులు కమలకురు ప్రసాద్, నిరంజన్ రెడ్డి, బాలినేని శ్రీనివాసులు అవార్డులను దక్కించుకున్నారు. ఈ అవార్డులను ముఖ్య అతిధులు, ప్రజా ప్రతినిధుల చేతులు మీదుగా అందుకున్నారు. భారతదేశంలో 1200 మంది ఉపాధ్యాయులు ఎంపికవ్వగా ఖాజీపేట మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులకు ఎంపిక కావడం సంతోషదాయకమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఖూన్ కా రిష్తా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జోసా లుక్కాస్ జ్యువలరీ, ఖూన్ కా రిష్టా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జోసా లుక్కాస్ మేనేజర్ గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖూన్ కా రిష్టా సేవలను అభినందనీయమన్నారు. ముమ్ముందు మరిన్ని ప్రజలకు ఉపయోగపడే సేవలు జోసా లుక్కాస్, ఖూన్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ కోనసాగించాలని కోరారు. ఖున్ కా రీష్టా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.తారిఖ్ అలి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనిషి మరొకరి ప్రాణాలను కాపడడంతో పాటు తనకు తాను ఆరోగ్యంగా ఉంచుకోవడంలో సఫలమవుతాడని తెలిపారు. 40 మంది రక్తదానం చేసిన జోసా లుక్కాస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి యువకుడు మన దేశానికి సైనికుడిలా పని చేయాలి, అది ఇటువంటి మంచి కార్యాలలో పాల్గొంటే ఇతరులకు స్ఫూర్తిని కల్పించినవరవుతారని పేర్కొన్నారు. అందుకే యువకులు రక్తదాన శిబిరాలలో ఎక్కువగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జోసా లుక్కాస్ అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, పి.ఆర్.ఒ పవన్, ఎస్.యం.ల్యాబ్ అధినేత మస్తాన్, బృహద బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేశ్వరి, టెక్నీషియన్లు సన్నీ, బీబీజాన్, హర్ష పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న సిబ్బంది

శాస్త్రీయ దృక్పథం విస్తరించాలి

జెవివి గౌరవ అధ్యక్షులు డాక్టర్ వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని వైవీయూ ప్రొఫెసర్, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, జెవివి జెండాను పూర్వ కార్యదర్శి రఘునాథరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వార్షిక సమావేశంలో జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ సైన్స్ పురోభివృద్ధిని కాంక్షించేవారు శాస్త్రీయంగా అనేక విషయాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మూఢనమ్మకాలను విడనాడి సైన్స్ మూలంగా జీవించాలని తెలిపారు. ప్రకృతి వినాశనం మానవ మనుగడకు, జీవరాసులకు ఎంతో నష్టమని హెచ్చరించారు. పర్యావరణ సమతుల్యం లేకపోతే అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితి మందగించిందని పేర్కొన్నారు. దీని పర్యవసానంగా అమెజాన్, గూగుల్, టెస్లా వంటి పెద్ద కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాల కల్పన పేరుతో పెట్టుబడిదారులు ప్రభుత్వ రాయితీలను పొందుతూ ఉన్నారని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి ఏమాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జెవివి నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధాల్లో పై చేయి సాధించడానికి అమెరికా ప్రయత్నిస్తుందని తెలిపారు. నాటో దేశాలను కలుపుకుని రష్యాను ఓడించడానికి ముక్కలు చేసి అక్కడున్న సహజ సంపదలను కొల్లగొట్టాలనే ప్రయత్నం ఉక్రెయిన్ లాంటి దేశాలను పావులుగా వాడుకుంటుందని చెప్పారు. రష్యా బలమైన సామ్రాజ్య దేశం కావడంతో ఉక్రెయిన్ లాంటి దేశాన్ని పావుగా వాడుకుంటూ దానిపై దాడి చేసి సర్వనాశనం చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాలు లాభాల దాహంతో వనరులన్నిటిని కొల్లగొడుతున్నాయని పేర్కొన్నారు. అడవులను నాశనం చేయడంతో విపరీతంగా కార్బన్ ఉద్గారాలు విడుదల చేయడంతో వాతావరణం వేడెక్కిపోతుందని తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం మాట్లాడే స్థితిలో లేదని పేర్కొన్నారు. జెవివి బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న మాట్లాడుతూ జిల్లాలో శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమాలు వివిధ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థుల ద్వారా నిర్వహించామని పేర్కొన్నారు. మూఢనమ్మకాలను అరికట్టే ప్రయత్నంలో భాగంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవి వినోద కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని చెప్పారు. జిల్లాలోని 32 మండలాల్లో చెకుముకి పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త కళాజాతలో భాగంగా జిల్లాలో రెండు చోట్ల నిర్వహించామని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం, మహిళా దినోత్సవం, కలకత్తాలో డాక్టర్ పై జరిగిన అత్యాచారకాండకు నిరసన కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కేరళలోని వాయినాడు ప్రాంతంలో జల విలయం విషాదకరమని, జిల్లా నుంచి కొంత ఆర్థిక సాయంపంపించామని పేర్కొన్నారు. జెవివి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవదత్తం, శివరాం, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, సుబ్బయ్య, మురళి, డేవిడ్, శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, రాజేష్, అరుణ, రూత్ ఆరోగ్యమేరీ, ప్రసాద్, భరత్, ప్రసన్న, సభ్యులు, యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరామిరెడ్డి

ఘనంగా శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాత కడప టిడిపి నాయకులు వెంకటసుబ్బయ్య రైస్ మిల్లులో 25 కిలోల భారీ కేకును టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, ఎద్దుల శంకర్, చైతన్య ఆధ్వర్యంలో కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాం క్షించారు. వాసు నాయకత్వంలో తాము పని చేస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్, నాయకులు శేఖర్ రెడ్డి, శ్రీధర్, నూనె కృష్ణ, రాజి, పెద్ద బోయిన రమేష్, సుధాకర్, మోడమింద పల్లె సురేష్, మనోజ్ కుమార్, శ్రీనాథ్, సుమిత్ర, అనిక రమణ, దశ కుమార్, నాగేశ్వరరావు, ఆడవాళ్ల రాజా, సుధీర్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి (వాసు) సేవలు అమోఘమని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం వేంపల్లెలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో టిడిపి కార్యాలయం ఏర్పాటుకు శ్రీనువాసులు రెడ్డి దాదాపు రూ. 5 కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జోగిరెడ్డి, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, లోమడ భాస్కర్ రెడ్డి, గొటూరు నాగభూషణం, గోగుల మల్లికార్జున, భాస్కర్, పీరా సాహెబ్, డక్కా రమేష్ వీరబద్ర, పివి రమణ, రామకృష్ణారెడ్డి, గండి మాజీ చైర్మన్ వెంకట స్వామి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొంతు సుబ్బారావు, తెలంగాణ వలి, యాసిన్ తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయ్‌కుమార్

యువతీ, యువకులు నిరుద్యోగ సమస్యలపై ఉద్యమించాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన యువత ఉద్యమించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్.కె మస్తాన్ షరీఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి బతు కుతున్నారని, అదే ఈ రాష్ట్రంలో ఉపాధి ఉంటే పరాయి రాష్ట్రాలకు పోవాల్సిన అవసరం లేదన్నారు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతీ యువకులకు అనేక హామీలు ఇచ్చిందని ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు, వివిధ శాఖలలో ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నాయని, వాటిని జాబ్ కేలండర్ ద్వారా భర్తీ చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువ కులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి దాని ద్వారా చదువుకున్నటువంటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని ,డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్,నాగేంద్ర, నాగలక్ష్మి ,ఫాతిమా , నాగేశ్వరి ఖలీల్ షరీఫ్ పాల్గొన్నారు.

జాతీయ అంధుల సమైక్య జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎన్‌జిఒ కాలనీలో ఉన్న జాతీయ అంధుల సమైక్య కార్యాలయంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందిన సమైక్య నాయకులు గిద్దలూరు వెంకటరమణకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆదివారం ఎన్నికకు సమైక్య జాతీయ కార్యదర్శి కాకర్ల నాగేశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు పరిమి పార్థసారథి, ప్రధాన కార్యదర్శి ఆర్.నాగేంద్ర కుమార్ రెడ్డి, కోశాధికారి దొంతు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు దస్తగిరి, నాగరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు రామసుబ్బమ్మ, కార్యదర్శులు ఉమామహేశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు, యువ కార్యదర్శి శివ, కార్యవర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, నాగ కుమార్, పీర్ బాషా వెంకట కృష్ణారెడ్డి, గంగులప్పా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2027లో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నూతన కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

విరాళాలిచ్చి ఆదుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విజయవాడలో వరద భీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం మానవత్వం కలిగిన ప్రతి ఒక్కరు విరాళాలు ఇచ్చి సహాయం చేయాలని డివైఎఫ్ఐ మాజీ నాయకులు వీరబాల శివ నారాయణ తెలిపారు. వరద బాధితుల సహాయార్థం కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మార్కెట్ ఏరియాలో ప్రజల వద్ద విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు శివ నారాయణ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు కారణంగా విజయవాడ నగరం మొత్తం వరదలలో భీభత్సం జరిగిందని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాల శివకుమార్ మాట్లాడుతూ విజయవాడ వరదలను కేంద్రం జాతీయ విపత్తు గా ప్రకటించాలని పేర్కొన్నారు. వరదల కారణంగా ఇప్పటికే అపార నష్టం జరిగింది అన్నారు. వారం రోజుల నుండి ప్రజలకు వరద బాధితులకు సహాయ కార్యక్రమాలలో రాష్ట్ర నాయకత్వం పాల్గొని సేవలు అందిస్తున్నారు అన్నారు. పోరాటాలలోనే కాదు సేవలలో కూడా ముందుంటామని డివైఎఫ్ఐ నాయకత్వం నిరూపించింది అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ పట్టణ నాయకులు సురేంద్ర కృష్ణారెడ్డి, మోహన్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె గ్రామస్తుల ఆహ్వానం మేరకు వినాయక చవితి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వినాయక చవితిని ప్రజలు ఆనవాయితీగా జరుపుకోవడం సంతోషం అన్నారు. ఐక్యమత్యానికి ప్రతీక అన్నారు. అనంతరం గ్రామ నాయకులు వెంగళ నారాయణ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి గురివిరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - వేంపల్లె

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, సంతోషాన్ని ఇస్తాయని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత ఆట స్థలంలో సిరిగిరెడ్డి దివాకర్ రెడ్డి జ్ఞాపకార్థం మిని క్రికెట్ టోర్నమెంట్‌ను నాగిశెట్టి సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని చెప్పారు. రోజూ క్రీడ ఆడడంతో శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో మిని టోర్నమెంట్ నిర్వాహకులు బాల వెంకటరెడ్డి, నాగిశెట్టి సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, ఆటో ఢీ : ఇద్దరు మృతి

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

సిద్దవటం మండలం మాధవరం-1 సమీపంలో వాసవి కళాశాలకు ఎదురుగా కడప - చెన్నై హైవేలో ఆదివారం ఉదయం కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. కడప నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్నట్లు ఆటోను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. కారులో ఉన్న ఒకరికి, ఆటోలోని ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కడప నుంచి వస్తున్న కారు గేదెను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ఉన్న రమణ (35), ఆటో డ్రైవర్ సుభాన్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడినవారిని 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

పెద్దముడియం : పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన పెరుమాళ్ల దిలీప్ (25) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు. మృతుడు శనివారం జమ్మలమడుగు నుంచి తన సొంత ఊరు పెద్దపసుపులకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గ మధ్యలో ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వినాయక చవితి రోజు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తల్లి దండ్రుల రోదన మిన్నంటింది. ఎస్ఐ సుబ్బారావు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు దొంగల అరెస్టు

ప్రజాశక్తి- చక్రాయపేట

జిల్లాలో వేర్వేరు సంఘటనల్లో 40 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్ లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు స్మగ్లర్లును టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్‌పి ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్‌పి పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ఐ లింగాధర్ లు కరకంబాడి అటవీ ప్రాంతంలోని తిరుపతి–కడప జాతీయ రహదారిలో ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వచ్చిన ఒక కారును తనిఖీ చేపట్టగా అందులోని ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పారిపోయారు. మరో ఇద్దరిని టాస్క్ ఫోర్స్ టీమ్ పట్టుకున్నారు. ఇద్దరు తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన వారు. వారిని అరెస్టు చేసి, కారులోని 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ పి. నరేష్ టీమ్ కడప జిల్లా వేంపల్లి వద్ద, చక్రాయపేట వద్ద కూంబింగ్ చేస్తుండగా మాలా బీళ్లు వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలతో వస్తుండగా చుట్టుముట్టారు. అందరూ పారిపోగా ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతను కడప జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రాంతంలో పడి ఉన్న 28 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. రెండు కేసులను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషనులో కేసులు నమోదు చేయగా సిఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. ఆపరేషన్లలో స్థానిక అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడు, దుంగలతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : పిసిసి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - కడప

విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 5 వేల కోట్లు విడుదల చేయాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నగరం రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని, బుడమేరు వరద వల్ల తీవ్రంగా దెబ్బతింది అని అన్నారు. మళ్లీ కోలుకోవాలంటే కేంద్రం ఉదారంగా ఆదుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ అమలు ఎప్పుడని ఆయన ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుందని, రైతులు అన్నదాత సుఖీభవ పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రతి ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ. 20 వేలు పథకం కింద ఇస్తామని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది అన్నారు. ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప - రేణిగుంట జాతీయ రహదారి అతి ప్రధానమైన రహదారి, చెన్నై - ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారి పనులు చేపట్టాలన్నారు. మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయని కారణంగా కడప - బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయిందన్నారు. సమావేశంలో కడప నగర నూతన నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, శ్యామలాదేవి, చిన్న కుల్లాయప్ప, కదిరి ప్రసాద్ గౌడ్, సంజయ్ కాంత, నాగరాజు, బాలం సుబ్బరాయుడు, మాస్ మహబూబ్ బాషా, పోర్ల గంగాధర్, వినయ్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న పట్టాదారులు

న్యాయం చేయాలని నిరసన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాల స్థలంలో కట్టుకున్న పునాదులు ప్రస్తుత ప్రభుత్వం కూలగొట్టడం తగదని, తమకు న్యాయం చేయాలని ఆదివారం బాధితులు జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. మండల పరిధిలోని బొమ్మేపల్లి పంచాయతీ ఒంటిమిద్దె గ్రామ సమీపాన కట్టుకున్న బేస్ మట్టాలను జెసిబి సాయంతో కూలగొట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు వెంటనే సంఘటన స్థలంలోకి వెళ్లి చూడగా నేల మట్టం చేసిన దృశ్యాన్ని చూసి బోరున విలపించారు. అనంతరం జమ్మలమడుగు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి సిఐ లింగప్పకు వివరించారు. గత ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా 43 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని మిగతా వారికి అప్పటి తహశీల్దార్ మారిపోవడంతో ఇవ్వలేకపోయారన్నారు. అనంతరం సిఐ లింగప్ప మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రస్తుతం అందుబాటులో లేరని, బుధవారం వస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని, బాధితులందరికి చట్ట ప్రకారం న్యాయం చేస్తామని చెప్పారు.

వైభవంగా ఆరోగ్యమాత తిరుణాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలోని ఆరోగ్యమాత తిరుణాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. , కడప అపోస్తులిక పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలిబాలి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మేత్రాసన వికర్ జనరల్ రెవ ఫాదర్ తలారి బాలరాజు, కోశాధికారి రెవ ఫాదర్ సంబటూరు సురేష్, పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ప్రసాద్ రావు, మేత్రాసన గురువులతో కలిసి, విశ్వాసులను ఉద్దేశించి ఆరోగ్యమాత సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో కడప మెత్రాసన గురువులు, అమ్మగార్లు, మేత్రాసన ఉజ్జీవక ఉపదేశులు, చర్చిపెద్దలు, యువత, విశ్వాసులు పాల్గొన్నారు.

కొత్తపల్లి పంప్ హౌస్ సామర్థ్యం పెంచండి

ప్రజాశక్తి - వేముల

పులివెందుల బ్రాంచ్ కెనాల్ నుంచి వేముల మండలంలోని వి.కొత్తపల్లి చెరువుకు నీరు నింపేందుకు నిర్మించిన పంప్ హౌస్ సామర్థ్యాన్ని పెంచాలని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చఆర్జి బి.టెక్ రవిని కొత్తపల్లె రైతులు కోరారు. ఆదివారం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయన్ను పేర్ల తులసి రెడ్డి, పుల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి మరికొందరు రైతులు కలిసి సమస్యలు విన్నవించారు. కొత్తపల్లి వద్ద నిర్మించిన పంప్ హౌస్ సామర్థ్యం చాలా చిన్నది కావడంతో 76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్తపల్లి చెరువుకు ఎన్నో రోజుల పాటు నీటిని లిఫ్ట్ చేసినప్పటికీ చెరువు నిండడం లేదని చెప్పారు. నీటిని నింపేందుకు పంప్ హౌస్ సామర్థ్యంను పెంచి చెరువును చిత్రావతి నీటితో నింపాలని రైతుల కోరారు. వెంటనే స్పందించిన మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వి.కొత్తపల్లి చెరువు లిఫ్ట్ పంప్ హౌస్ సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారాలకు పంపించాలని ఆదేశించారు.

ప్రజలతో మమేకమైన బిటెక్ రవి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నియోజవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి మమేకమయ్యారు. ఆదివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని తన స్వగృహంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పలువురు కార్యకర్తలు తమ సమస్యల వివరించగా వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనిబిసెంట్ పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం అయ్యాయి. అండర్ -18,20,23 స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుండి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 100, 200, 400, 1000 మీటర్ల లాంగ్,హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో జావలిన్‌త్రో, క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 14,15,16 తేదీలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించబోయే ఎపి స్టేట్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాష తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ అన్నారు. ఆదివారం వినాయక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను 3, 5 రోజులు పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో మందు బాబులు మద్యం సేవించినా, అధికంగా బాణా సంచాలు పేల్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద నిర్వాహకులు ఎటువంటి ఆటంకాలు చోటుచేసుకుండా నిమజ్జన కార్యక్రమానికి తరలి వెళ్లాలని ఆయన సూచించారు. నిమజ్జనానికి వెళ్లే ప్రాంతాలను కూడా కమిటీ సభ్యులు పోలీసులకు తెలియజేయాలన్నార. నిమజ్జనానికి వెళ్లే ప్రాంతాలలో దారిపొడిన పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అర్బన్ సిఐ జీవన్ గంగనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కడప

రోడ్డు ప్రమాద నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. నగరంలోని తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం క్యాంపు కమాండింగ్ అధికారి విజ్ఞప్తి మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎన్.సి.సి క్యాడెట్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీహరిరావు, సుబ్రహ్మణ్యం క్యాడెట్లకు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు ప్రమాద భీమా ఉపయోగాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడంతోపాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ మహేష్, శివరాం, గంగాధర్, నాగరాజు నాయక్, స్వామినాథ్ పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, సిఎల్‌ఎన్. రెడ్డి, కొండారెడ్డి, బస్నెట్ పాల్గొన్నారు.



రూ.50 వేల చెక్కును అందజేస్తున్న నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు

ఆర్థిక సాయం సంతోషకరం

ప్రజాశక్తి - వేంపల్లె

వరద బాధితుల కోసం దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయడం సంతోషకరమని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెకు ఆయన విచ్చేశారు. ఈనేపథ్యంలో ఎస్‌టియు మాజీ నాయకులు సింగారెడ్డి నరసింహరెడ్డి తన వంతుగా వరద బాధితుల కోసం రూ. 50 వేలు చెక్కును బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డికి అందజేశారు. పులివెందుల మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ దొంతు సుబ్బారావు రూ. 20 వేలు అందజేశారు. దాతలు వరద బాధితులకు సహాయం చేయాలని ఆర్థిక సహాయం చేయడం అభినందనీయం అన్నారు. మండల వ్యాప్తంగా టిడిపి నాయకులు దాదాపు రూ 2 లక్షల పైగా వసూలు చేశారని ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి బిటెక్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో టిడిపి యవ నేత రజనీకాంత్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నరసింహరెడ్డి, వేమా కుమార్, వీరబ్రద్ర, డక్కా రమేష్ తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'బ్లాక్ మ్యాజిక్' పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఆర్ఎస్ రోడ్‌లోని జి.ప్రొడక్షన్స్ కార్యాలయంలో జి.ప్రొడక్షన్స్ బ్యానర్ పై మహాదేవ రెడ్డి నిర్మాణ సమక్షంలో ప్రొడక్షన్ నంబర్ 3 చిత్రం 'బ్లాక్ మ్యాజిక్' చిత్రం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ప్రముఖులు మడక చక్రధర్, పి.నరేష్, శ్రీకాంత్, వేణుగోపాల్, షేక్ అమిర్ బాష, మస్తాన్, గ్రాండ్ మూవీ రాయచోటి రాచయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జిల్లా వాసులు సినిమా ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. 'బ్లాక్ మ్యాజిక్' చిత్రం భయంతో కూడుకున్న కథాంశంతో అద్భుతమైన సన్నివేశాలతో రూపొంచారని చెప్పారు. డైరెక్టర్ హబీబ్ మాట్లాడుతూ మన జిల్లా సినిమా కాబట్టి, జిల్లాలోని నటీనటులకే అవకాశం కల్పించామన్నారు. రాయలసీమలో ఉన్న కళాకారులు ఈ సినిమాలో నటిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఇఒ

అక్షరాస్యత ప్రగతికి ఆధారం

ప్రజాశక్తి - వల్లూరు

అక్షరాస్యత ప్రగతికి మూలం.. అభివృద్ధికి సహకారమని ఎంఇఒ పుత్తా విజయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వల్లూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 58 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్యం నిరక్షరాస్యత ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని. నిరక్షరాస్యత నిర్మూలిస్తేనే దారిద్యం నిర్మూలన జరు గుతుం దని అన్నారు. అక్షరాస్యత గురించి వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, జిల్లా గర్ల్స్ చైల్డ్ డెలప్‌మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎపిఎం శైలజ, పాఠశాల ప్రిన్సిపల్ నసీం మునిషా, విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నులు విధించడం తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి విగ్రహాల సైజ్‌ను బట్టి పన్నులు వేయడం తగదని వెంటనే విరమించుకోవాలని వైసిపి రాష్ట్ర ఎస్‌సిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరమూ కుల మతలాకు సంబంధం లేకుండా అందరూ ఘనంగా చేసుకుంటారన్నారు. ఈ లాంటి సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది నుంచి స్వామి విగ్రహాల వద్ద మైకులకు పరిమిషన్ కోసం రుసుం వసూలు చేయడం, కరెంట్ బిల్లులు యాడ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్కో విగ్రహానికి రూ 350 నుండి రూ 700 వేస్తామనటం సరైంది కాదన్నారు.

వాడవాడలా వినాయక వేడుకలు



కడప సిటీ : కడప నగరంలోని విజయ దుర్గ కాలనీలోని 4వ రోడ్డులో శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని 22వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయ దుర్గా దేవి ఆలయం వ్యవస్థాపకులు శ్రీ దుర్గా మల్లికార్జున రావు, దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు సంగనాదం ఆంజనేయులు, గోవిందు నాగరాజు, ఆర్ సుధాకర్, కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, సిఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, రాజారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిమ్మారెడ్డి సాంబశివరెడ్డి, సుబ్బన్న, గుత్తి వేణు, రఘునాథ్ నాయుడు, విజయదుర్గా కాలనీ వాసుల ప్రజలు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. **ముద్దనూరు :** మండలంలో వినాయక వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపాల్లో విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కొత్తకొట్టాల వీధిలో శ్రీ గురు యువసేన వినాయక ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. కడప జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎమ్. గుర్రప్ప పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, నారాయణ యాదవ్, కమిటీ సభ్యులు ఓబులేసుయాదవ్, షరీఫ్, దస్తగిరి, అనిల్, రంగనాయకులు, గురుతేజ, ప్రదీప్ పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజల ఆనందోత్సాహాల మధ్య వినాయకుడు మంటపాలలో కొలువుతీరాడు. కమలాపురం మండల వ్యాప్తంగా సుమారు 100 విగ్రహాలు నెలకొల్పారు. కమలాపురం క్రాస్ రోడ్స్ లో కొలువు తీరిన వినాయకుడికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, తన తండ్రి పుత్త నరసింహారెడ్డితో పాటు కలిసి తొలి పూజ చేశారు. **ఖాజీపేట :** ప్రజలందరూ వినాయక చవితి వేడుక సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అగ్రహారం, బస్టాండ్ కూడలి, బి. కొత్తపల్లె , సిద్ధాంతి పురం, కూనవారి పల్లె, దుంపల గట్టు, కొత్తపేట, స్థానిక టీచర్స్ కాలనీలో ఏర్పాటుచేసిన గణనాథుడు ప్రత్యేక రూపాలను సంతరించుకున్నారు. మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో బీరం శ్రీధర్ రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాలలో వినాయక చవితి వేడుకను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన గణనాథుడికి పాఠశాల యాజమాన్యం బీరం సుబ్బారెడ్డి, బీరం సరస్వతమ్మ, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. **వేంపల్లె :** వినాయక చవితి సందర్భంగా వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి వేర్వేరుగా సందర్శించారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్దకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

కమలాపురం టౌన్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

రావడంతో ట్రిపుల్ ఐటి పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వినాయక ప్రతిమ వద్ద పూజలు చేసిన ఎమ్మెల్సీకి శాలువతో సత్కరించారు. వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో, హరిజన వాడ, శ్రీరాం నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను బిటెక్ రవి సందర్శించారు. కార్యక్రమాల్లో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జీవి రమణ, డివి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి శివ, అనిల్ కుమార్ రెడ్డి, కావలి భాను కిరణ్ గోగుల మల్లికార్జున మారుతి తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం పదిన్నర గంటల నుంచి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు ఆయా గ్రామాల పరిధిలోని అర్చకులు చేశారు. సాయంత్రం, రాత్రి వేళలో ప్రత్యేకంగా కోలాటాలు, తాళాల భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం చాలా వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేశారు. **చింతకొమ్మదిన్నె :** మండల వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.



కమిటీ నిర్వాహకులు సంస్కృతి సాంప్రదాయాలు నేటి తరం యువతీ యువతలకు తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా సాయంత్రం 6 నుండి వినాయక చవితి మండపాల్లో యువకులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నిర్వాహకులు ఆదివారం రాత్రి 8గంటల నుంచి కోలాటాలు, చెక్కభజనలు నిర్వహించారు. ఊటుకూరు ఎస్‌సి కాలనీలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను టిడిపి మండల ఎసి సెల్ మాజీ కన్వీనర్ గుర్రాల రెడ్డయ్య ఆధ్వర్యంలో సాయంత్రం నుండి బాణాసంచా పేలుస్తూ, డప్పులు వాయిస్తూ, రంగులు వెదజల్లుకుంటూ ఉత్సాహంగా నిమజ్జనం చేశారు. వినాయక చవితి ఉత్సవాలను నిమజ్జనం చేసే ప్రాంతాలను సిఐ శివశంకర్ నాయక్ పరిశీలించి సిబ్బందికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. **చాపాడు :** మండల పరిధిలోని పలు గ్రామాలలో ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా స్వామివారి గ్రామోత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. సిద్ధారెడ్డిపల్లె, మైత్రాయపల్లె, నాగాయపల్లె గ్రామంలో స్వామివారి ఊరేగింపు ను ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య వినాయక ప్రతిమను గ్రామోత్సవం నిర్వహించి అల్లాడుపల్లె వద్ద కుందూ నదిలో నిమజ్జనం చేశారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్ధారెడ్డి పల్లెలో లడ్డు వేలంపాట నిర్వహించగా రూ. 19వేలు పలికింది.